# రోజులుమారాయి

- రాధిక నోరి, Tallahassee, FL.

గణపతి ఇండియా ట్రిప్ నుండి వెనక్కి వచ్చాడని తెలియగానే స్నేహితులంతా అతని చుట్టూ గుమిగూడారు. ఎందుకంటే ఈసారి గణపతి ఇండియా వెళ్ళటానికి ప్రత్యేకమైన కారణం వుంది.

'అదేమిటిరా? జంటగా వస్తావని అనుకున్నాం, అలా ఒంటరిగా ముఖం వేలాడేసుకుని వచ్చావేం? నువ్వు కావాలనుకున్న రంభ ఎవరూ దొరక లేదా?' సరదాగా స్నేహితులంతా అడిగారు.

'రంభ నాకు దొరక్కపోవటం కాదు. నేనే ఎవరికీ నచ్చలేదు' నిరుత్సాహంగా అన్నాడు గణపతి.

'అదేమిటీ? ఆ అనకాపల్లి అమ్మాయి వాళ్ళ సంబంధం ఆల్మోస్ట్ అయిపోయినట్లే అన్నావుగా?' ఆశ్చర్యంగా ఒక స్నేహితుడు ప్రశ్నించాడు.

'అలాగనే అనుకున్నాము. అందుకే ముందు ఆ అమ్మాయిని చూడటానికెళ్ళాను. కానీ నేను కాలిఫోర్నియాకి మూవ్ అయితే తప్ప ఆ అమ్మాయి నన్ను చేసుకోవటానికి ఒప్పుకోదుట' నెమ్మదిగా అన్నాడు గణపతి.

'కాలిఫోర్నియానా? ఎందుకు?' అయోమయంగా అడిగారు స్నేహితులు.

'నేను పని చేస్తున్న IBM పరిస్థితి ఇప్పుడు బాగా లేదు కాబట్టి కాలిఫోర్నియా కనక మూవ్ అయ్యేటట్లయితే అక్కడ కంప్యూటర్ కంపెనీలు చాలా వున్నాయిట. జాబ్ ఎస్యూరెన్స్ తోపాటు స్టాక్ ఆప్షన్ బెనిఫిట్స్ కాంపెటీటివ్‌గా ఇస్తారట. అందుకని అక్కడికి మకాం మార్చేయాలిట' గణపతి వివరిస్తుంటే స్నేహితులంతా ఆశ్చర్యంగా విన్నారు.

'ఎక్కడో అనకాపల్లిలో వున్న అమ్మాయికి ఇక్కడి కాలిఫోర్నియాలోని స్టాక్ ఆప్షన్ సంగతి ఎలా తెలిసిందిరా?' ఇంకా అయోమయంలోంచి తేరుకోలేక అడిగారు.

'ఏమో! నాకేం తెలుసు? అంతే కాదు. O.J. Simpson కేసు విషయంలో మీ అభిప్రాయం ఎమిటి? అతనా నేరం చేసాడనే మీరు నమ్ముతున్నారా?' అని కూడా అడిగింది అన్నాడు గణపతి.

'నిజంగా! మరి నువ్వేం చెప్పావు?' గణపతి చెప్తున్న విషయాలు వింటూ వుంటే ఆశ్చర్యంతో మతి పోతోంది స్నేహితులకి.

ఈ అమ్మాయితో ఇంక పెళ్ళి ఎటూ కాదు కదా అని 'O.J. Simson ఎవరో నాకు తెలీదని' చెప్పాను గణపతి కోపంగా అన్నాడు.

స్నేహితులంతా పకపకా నవ్వారు. పాపం గణపతి అనుకున్నారు.

'నాకు ఒళ్ళు మండుతూ వుంటే మీకు నవ్వులాటగా వుందా!' అంటూ గణపతి బాగా వుడుక్కున్నాడు. మళ్ళీ తనే చెప్పటం ప్రారంభించాడు.

ఆ తర్వాత ఢిల్లీ వెళ్ళాను ఇంకో అమ్మాయిని చూడటానికి. నాకు గ్రీన్‌కార్డ్ వుండటం వలన స్పౌజ్‌ని స్పాన్సర్ చేస్తే వాళ్ళు ఇక్కడకు రావటానికి 3,4 ఏళ్ళు పడుతుంది కదా! అందుకుని ఈ లోపు నా స్పౌజ్‌గా కాకుండా వేరే ఇంకేదైనా స్టేటస్‌లో ఇక్కడకు రావటానికి ఆ అమ్మాయికి నేను వీసా ఇప్పించాలిట. ఇదేమన్నా జరిగే పనేనా? అమెరికన్ కోన్సులేట్ లోని వాళ్ళందరూ నా మేనమామ కొడుకులు అనుకుంది కాబోలు గణపతి కొంతులో మళ్ళీ కక్ష, కోపం పలికాయి. స్నేహితులంతా నోళ్ళు వెళ్ళబెట్టి వింటున్నారు.

గుంటూరులో ఇంకా అమ్మాయిని చూసాను. 'మీరు మెడిసిన్ చదవకుండా ఇంజనీరింగ్ ఎందుకు చదివారు? అమెరికాలో డాక్టర్ల సంపాదన చాలా బావుంటుంది కదా' అని అడిగింది. గణపతి కాస్త ఆగి మళ్ళీ చెప్పటం మెదలెట్టాడు.

'పెద్దయిన తర్వాత అమెరికా వెళ్తానని నాకు తెలీదు. తెలిస్తే చిన్నప్పుడు ఇంటరు రోజుల్లో లెక్కలు కాకుండా సైన్స్ గ్రూపు తీసుకునే వాడిని. తీరా అమెరికా వెళ్ళిన తర్వాత లైను మారదామంటే టూలేట్ అయిపోయింది. అయినా ఎంత అమెరికా అయితే మాత్రం అందరూ డాక్టర్లే అయితే ఇంక వేరే వృత్తిని చేపట్టేవారు ఎవరు వుంటారు?' అని చెప్పేసాను. ఈ ఆడపిల్లలకి మొగుడి సంపాదన మీద ఎన్ని ఎక్స్‌పెక్టేషన్స్ వుంటాయో! నేను డాక్టరు కాదని డిసప్పాయింట్ అయినట్లుంది. పెళ్ళి చూపులకు ముందే తెలుసుగా నేను డాక్టరుని కాదు, ఇంజనీరుని అని' వుక్రోషంగా అన్నాడు గణపతి. స్నేహితులంతా మౌనంగా వింటున్నారు.

మా వూళ్ళోనే ఇంకో అమ్మాయిని చూసాను.

'అమెరికాలో పనివాళ్ళెవరూ వుండరు కదా! మరి ఇంటి పనులలో మీరు నాకు సాయం చేస్తారా? మీకు ఏఏ స్వీట్స్ చేయటం వచ్చును?' అంటూ ప్రశ్నించింది. పెళ్ళికి ముందే ఇన్ని షరతులు పెడుతున్న అమ్మాయి రేపు పెళ్ళయిన తర్వాత అన్ని పనులలోనూ వంతులు పోతూ పిల్లల్ని కూడా నన్నే కనమంటుందని భయం వేసి నేనే వద్దన్నాను' అన్నాడు గణపతి. స్నేహితులంతా మళ్ళీ నవ్వారు. అమ్మో ఆడపిల్లలు! ఎంత డిమాండింగ్‌గా మారారు అనుకున్నారు.

అసలు ఇండియాలో ఇప్పుడు చాలామంది గ్రీన్‌కార్డ్ వున్నవాళ్ళకి పిల్లల్ని ఇవ్వటానికి ముందుకు రావటం లేదుట. వచ్చిన ఈ సంబంధాలలోనే ఏదో ఒకటి ఖాయం చేసుకోక పోతే ఇంక వేరే సంబంధాలు రావు, ఇంక నీకు పెళ్ళి కాదు అంటూ అమ్మ నాన్న ఒకటే బలవంతం పెట్టారు. పెళ్ళి కాకపోయినా ఫరవా లేదు కానీ ఇష్టం లేకుండానో, ఇలాంటి షరతులకి ఒప్పుకునో లేక ఇంకేదో అసంతృప్తిని మనసులో పెట్టుకునో పెళ్ళాడటం నా వల్ల కాదు, అందుకనే వచ్చేసాను అన్నాడు గణపతి.

'అది సరేరా, మీ నాన్నకి స్నేహితుడొకాయన తన కూతురిని చేసుకోమని చాలా అడుగుతున్నాడని అన్నావుగా! మరి ఆ అమ్మాయిని చూడలేదా?' అని ఒక స్నేహితుడు అడిగాడు.

'ఆ అమ్మాయి USMLE పరీక్షలు రాయటానికి సింగపూరు వెళ్ళిందిట. అక్కడి నుండి అక్కడే వున్న వాళ్ళ అన్నయ్య వాళ్ళతో పాటు యూరొప్ అంతా చూసి కానీ ఇండియా తిరిగి రాదుట' సమాధానం చెప్పాడు గణపతి. ఈలోపల నా వెకేషన్ టైం అయిపోయింది' అంటూ గొణిగాడు.

'నమ్మలేకుండా వున్నాము. మన దేశం మొత్తంలో నీకు సరిపోయిన ఆడపిల్లే దొరకలేదా? దేశం గొడ్డుపోయిందన్నమాట' అన్నారు స్నేహితులు.

'దేశమేమీ గొడ్డుపోలేదు. రోజులు మారాయి. ఆడపిల్లల, వాళ్ళ కన్నతల్లితండ్రుల ఎక్స్‌పెక్టేషన్స్ చాలా పెరిగిపోయాయి. అమెరికా అంటే భూతల స్వర్గం, అక్కడి జీవితం అంటే రాజభోగమే అన్న మిస్‌కన్సెప్షన్ ఇన్నాళ్ళూ అక్కడి వాళ్ళలో వుందేమో కానీ ఇప్పుడు మాత్రం కాదు. Not any more!. ఈ గ్రీన్‌కార్డ్

వుండటం ముఖ్యంగా ఒక డిస్క్వాలిఫికేషన్ అయిపోయింది. ప్రతివాళ్ళూ సిటిజెన్ ఎప్పుడు అవుదామని ప్లాన్ చేస్తున్నారో అని అడిగేవారే! 4,5 ఏళ్ళు మా అమ్మాయి వుసూరుమంటూ మా కళ్ళెదుట వుంటే చూస్తూ వుండలేము. H1 వీసా కానీ, సిటిజెన్‌షిప్ కానీ లేకుంటే మా పిల్లకు మా సంబంధం వద్దు అని ఆడపిల్లల తల్లి తండ్రులు మన ముఖాన్నే ఖచ్చితంగా చెప్తున్నారు, లేకుంటే అమ్మాయికి కూడా ఇమిగ్రేషన్ వచ్చేదాకా ఆరు నెలలకోసారి వచ్చి కనీసం 20 రోజులన్నా ఇండియా లో గడపాలని షరతులు పెడుతున్నారు. నేను ఇంకో రెండు రోజుల్లో తిరిగి వచ్చేస్తాననగా ఇంకో సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి తెలుగు లిటరేచరులో ఎమ్.ఫిల్. అట చేస్తోంది. అమ్మాయి చూడటానికి బాగానే వుంది, మిగిలిన విషయాలు కూడా బాగానే వున్నాయి కదా అనుకుంటే టైం ఒక ప్రాబ్లెమ్ అయిపోయింది. నాకు పెళ్ళి చేసుకోవటానికి ఇంక వ్యవధి లేదు. మళ్ళీ సంవత్సరం తర్వాత వచ్చినప్పుడు చేసుకుంటాను, ఇప్పుడు తాంబూలాలు పుచ్చుకుందాము అని మేము అంటే వాళ్ళు ఒప్పుకోలేదు. సంవత్సరం పాటు మేము ఆగము. మీ అబ్బాయి మళ్ళీ వచ్చినప్పుడు కబురు చేయండి. అంతదాకా మా అమ్మాయికి పెళ్ళి కాకుండా వుంటే అప్పుడు మళ్ళీ మాట్లాడుదాము అంటూ ఆ అమ్మాయి తండ్రి నిర్మొహమాటంగా చెప్పేసాడు' అన్నాడు గణపతి. అతని గొంతులో ఆశాభంగం స్పష్టంగా తెలుస్తోంది.

'విఘ్నేశ్వరుడి వివాహానికి అన్నీ విఘ్నాలే అన్నట్లుగా నీ పెళ్ళికి ఆదిలోనే ఎన్ని అడ్డంకులువస్తున్నాయిరా! మరిప్పుడేం చేస్తావు?' హాస్యానికి కుతూహలాన్ని జోడించి అడిగారు స్నేహితులు.

'ఎంచేయాలో, ఎలా చేయాలో అన్నీ ఆలోచించి పకడ్బందీగా ప్లాన్ వేసేసాను. మేమే పిల్లని సెలెక్ట్ చేయాలి అన్న పంతం మా అమ్మ, నాన్న ముందు మానెయ్యాలి. ఇండియా నుండి ఈ దేశానికి నాలాగే స్టూడెంట్‌గా వచ్చిన ఆడపిల్లలు అనేకమంది వున్నారు. ఏదన్నా పత్రికలో ఒక యాడ్ ఇస్తే బోలెడంతమంది రెస్పాన్స్ ఇస్తారు. అలా ఇక్క డే వున్న అమ్మాయి అయితే ఇంక ఇమిగ్రేషన్ బాధ, 4,5 ఏళ్ళ ఎడబాటు అన్న బెడద వుండవు. అంతగా అయితే ఆ అమ్మాయికి మల్టిపుల్ ఎంట్రీ వీసా వుంటే ఇండియాలో పెళ్ళవుతుంది. లేదా మా అమ్మ, నాన్నని ఇక్కడికే పిలిపిస్తాను, ఇక్క డే పెళ్ళి జరుగుతుంది. లేకపోతే సిటిజెన్‌షిప్ వచ్చేదాకా ఆగాలంటే జీవితంలో ఇంక శృంగార దశ దాటి కేవలం కంపానియన్‌షిప్ కోసం పెళ్ళి చేసుకునే దశ వచ్చేస్తుంది. ఈ సమస్య నాలాగా గ్రీన్‌కార్డ్ వున్న వాళ్ళందరికీ వున్నదే! అందరికీ ఇదే నేనిచ్చే సలహా' గురోపదేశం చేస్తున్న జ్ఞానిలా పోజు పెట్టి అన్నాడు గణపతి.

'ఏడిసినట్లే వుంది నీ చెత్త సలహా. అసలు చేతులు కాలేదాకా ఆగడం ఎందుకు, ఆ తర్వాత ఆకుల కోసం అలమటించడం ఎందుకు? మేం అందరం గ్రీన్‌కార్డ్ వచ్చేలోగానే పెళ్ళిళ్ళు చేసేసుకుంటాం. ఇప్పుడు నువ్వు చెప్పిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు ముందుగానే ఆలోచించి పెట్టుకుని పెళ్ళి చూపులలో అమ్మాయిల ఎటాక్స్‌కి సిద్ధపడి వుంటాములే' స్నేహితులంతా ఏక కంఠంతో అన్నారు.

గణపతి వాళ్ళ మాటలు వినటం లేదు. పత్రికలో తను ఇవ్వబోయే యాడ్‌ని సిద్ధం చేసుకుంటున్నాడు.


**NU DESIGNS**
Where Creativity Blooms!
Parsippany, NJ

**Professional Decorating Service for Weddings, Parties & Special Occasions**

*Wedding Mantapams
*Distinctive Arches & Props
*New Innovative Fresh Floral Design
*Unique Hall & Stage Decorations
*Custom Silk Floral Designs
*Balloon Arches and Centerpieces
*Customized Gifts

**Specialized Decorations & Favors for: Sweet 16, Anniversaries, Bridal & Baby Showers**

*Unbeatable Wedding & Reception Packages Available*
Experienced decorator and designer to guide you in making your special event really SPECIAL!
Call Malini Chandrasekhar (201) 884-0885

